# శ్రీ షిరిడీశ దేవ శతకము

రచన:- చింతా రామ కృష్ణా రావు



## అభివందనం

## శ్రీ షిరిడీశదేవశతకముపై సమీక్ష.

డా. ఎల్.ఎస్.యాజ్ఞవల్క్య శర్మ, M.A.; M.Phil., Ph.D.;

ప్రశాంతి నిలయం,

పాయకరావుపేట.

ఆధునికాంధ్ర వాఙ్మయం అనేక ప్రక్రియలతో శాఖోపశాఖలుగా విస్తృతమైనప్పటికీ శతక ప్రక్రియ మాత్రం అప్పుడూ యిప్పుడూ నవనవోన్మేషమై తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. తాను నమ్మిన దైవాన్ని గాని, వ్యక్తిని గాని, లేదా తన ఆత్మను గాని స్తుతిస్తూ స్వాభిప్రాయాన్ని నిష్కర్షగా ఆవిష్కరించే స్వేచ్ఛ శతక రచయితకుంటుంది.

ఇటీవలి కాలంలో శ్రీ చింతా రామ కృష్ణా రావు కవి వర్యుల కలం నుండి జాలువారిన" శ్రీ షిరిడీశ దేవ శతకం " ఒక ఉత్తమ రచనగా శ్రీ బులుసు వేంకటేశ్వర్లు వంటి కవి పండితులచే ప్రశంసలందుకుని ఆంధ్ర లోకాన్ని ఆకట్టుకుంటోంది. భక్తి రస ప్రధానమైన యిటువంటి ఆర్షసాహితీ మరందాన్ని ఆస్వాదించే భాగ్యం ఆంధ్ర లోకానికి కలిగించినందుకు శ్రీ రామకృష్ణాగ్రజులకు కృతజ్ఞతాభివందనలు సవినయంగా తెలుపుకుంటున్నాను.

నేటి కాలంలో భారతీయుల్ని ఆకట్టుకున్న దైవం షిరిడీశుడంటే అత్యుక్తి కాదేమో. సర్వ దేవతాతీత స్వరూపునిగా ఆ స్వామి అశేష భారత ప్రజలచే నీరాజనాలందుకుంటున్న విషయం లోక విదితమే. అటువంటి సాయి తత్వాన్ని ఈ కవి అష్టోత్తరశత చంపకోత్పలాలతో అర్చించి, సాయి కరుణకు పాత్రుడైనట్లు మనకు తెలుస్తుంది.

షిరిడీశ దేవునే మనం ఎందుకు కొలుస్తాం? అంటే

*చ:- అనితర సాధ్యమైన మహిమాన్విత శక్తులు చూపుచుండి, మ*
*మ్మనయము బ్రోతువీవు. పరమాత్ముడవంచు భజింతు మేము. ని*
*న్ననయముఁ గొల్చు చుండి,సుగుణాకర చిత్తులమై మెలంగఁ జే*
*య నిను మదిం దలంతుము. మహాద్భుత! శ్రీ షిరిడీశ దేవరా !*

అని తన ఆర్తిని మహాద్భుత శక్తి కలిగిన స్వామికి నివేదించారు కవి.

అలాగే ఈ క్రింది పద్యంలో భగవంతుడు సర్వాంతర్యామి అని చక్కగా వివరిస్తూ ఇలా అంటారు.

*ఉ:- కొందరు భక్త కోటి నిను కోవెల లోపలఁ గాంచు చుండ నిం*
*కొందరు సన్ను తాత్ము లకు గుండెలలో కలవంచుఁ గాంతు రిం*
*కొందరు దీనులందుఁ గడు కూర్మి ని నిన్ గని పొంగుచుండు. ని*
*న్న ందరి లోనఁ గాంచుటయె న్యాయము. శ్రీ షిరిడీశ దేవరా !*

స్త్రీవాద కవిత్వంలో స్త్రీ జనోద్ధరణకు పాటుపడ్డ కవులలో వీరు కూడా అగ్రగణ్యులు. ఈ శతకంలో అనేక పద్యాలు కాలానుగుణంగా స్త్రీల పట్ల జరిగే అన్యాయాలు అకృత్యాలు స్పష్టపరుస్తున్నాయి. సమస్యా పరిష్కారం కోసం కవి తన ఆవేదనను సాయికి నివేదించడం ఈ పద్యాల్లో మనం చూస్తాం. ఇందుకో ఉదాహరణ పద్యం చూడండి.

*చ:- మగువలపైన మూర్ఖత నమానుష హింసల నేచు మూర్ఖులన్*
*భగ భగ మండు యగ్ని శిఖపాలొనరింపు ముపేక్ష యేల? యీ*
*మగువలఁ గావకున్న వర మాతృజనంబిక మృగ్యమౌను. నీ*
*తెగువను జూపిబ్రోవుమయ తీరుగ ! శ్రీ షిరిడీశ దేవరా!*

అనాదిగా స్త్రీకి ఓ ప్రత్యేక ప్రతిపత్తి గల్గిన యీ దేశంలో మహిళలకు జరుగుచున్న అన్యాయాలను ప్రతిబింబింపఁ జేసిన పద్యాలు చదివితే సహృదయ పాఠకుల మనసుల్ని కలిచివేస్తాయనడంలో సందేహం లేదు.

సామాజిక స్పృహ గలిగిన కవిత్వం వీరిది అనడానికి ఈ పద్యం ఒక్కటి చాలు.

*ఉ:- హైందవ భావ ప్రేరణము నాత్మ ల ముస్లిము లొందఁ జేసి, యీ*
*హైందవ జాతి ముస్లిముల యద్భుత ప్రేరణమొందఁ జేసి, జై*
*హిందను భారతీయులుగ హిందువు ముస్లిము లిద్దరొక్కటై,*
*పొందిక నుండఁ జేసితివి, పూజ్యుడ ! శ్రీ షిరిడీశ దేవరా!*

ఇంకా
ఏది సతం బనిత్యమన నేది?......
నమ్మిన వారి చిత్తమున........

లోకమనంతమయ్య........

వృక్షములాదిదేవతలు........

గుమ్మడిపండు చందమున........

వంటి అనేక నానుడులు, పోలికలు, సందర్భోచితంగా వివరించి కవి తన లోకజ్ఞతను చాటుకున్నారు.

తన తల్లిదండ్రులను, గురువులను స్మరిస్తూ వ్రాసిన పద్యాలు కవికి వారిపట్ల గల అనన్య సామాన్య భక్తికి నిదర్శనాలు.

*ఉ:- కాణ్వ విరాజ నామమునఁ గ్రాలెడు సత్ శుభ శాఖజుండ. చిం*
*తాన్వయ సంభవుండ. చరితార్థుడ నీధర. రామకృష్ణుడన్.*
*నిన్వినుతించి, మ్రొక్కి, మది నిన్ గని, " శ్రీ షిరిడీశ దేవ" ప*
*రన్విరచించితీ శతక రాజము. శ్రీ షిరిడీశ దేవరా !*

అని కాణ్వ శాఖపై తనకు గల అభిమానాన్ని వ్యక్తీకరించడం అభినందనీయం.

ఉభయ భాషా ప్రవీణులు, నిరంతర రామాయణ పఠనా శీలురు, మహర్నటులు అయిన శ్రీమాన్ కల్వపూడి వేంకట వీర రాఘవాచార్యుల పట్ల తనకు గల గురు భక్తిని ఈ పద్యంలో ఇలా చాటారు.

*ఉ:-ఆర్యులు కల్వపూడి వినయాన్విత వేంకట వీర రాఘవా*
*చార్యుల పాద ధూళి విలసన్నుత జ్ఞాన ప్రబుద్ధిఁ గొల్వగా*
*వీర్యుడ! నీ కృపామృతముఁ బ్రీతిగ నీ శతకంబు లోన నే*
*నార్యులు మెచ్చ వ్రాసితిని హాయిగ. శ్రీషిరిడీశ దేవరా!*

ఆచార్య దేవోభవ అన్న దానిని సత్యం చేశారు శ్రీ రామ కృష్ణగారు.

కీ.శే. ముత్యం రామమూర్తి కవి పండితుల కోర్కెకు ప్రతీకగా ఈ శతక రచన గావించినట్లు మనకనిపిస్తుంది. వీరిద్దరి సంబంధం అటువంటిది. ఇలాంటి ఇద్దరు ఉద్దండ కవి పండితులు లభించడం " చోదవరం " ప్రజలు చేసుకున్నపూర్వ పుణ్యఫలం.

షిరిడీశునిపై తనకు గల అపార భక్తికి ఈ ఒక్క పద్యం " కలికి తురాయి ".

*ఉ:- నీ దరహాస చంద్రికలు నిత్యముఁ గ్రోల చకోరమౌదునా ?*

*నీ దరి కాంతులీను మహనీయ సముజ్వల జ్యోతి నౌదునా?*

*నీ దరిఁ జేరు భక్తుల పునీతపు పాద రజంబు నౌదునా?*

*నీ దరి కెట్లు జేర్చెదవొ? నిత్యుడ! శ్రీ షిరిడీశ దేవరా!*

అని తన వినమ్రతను తెలుపుకున్నారు.

ఈ శతకం చదివిన పాఠక లోకానికి అన్నీ శుభాలే జరుగుతాయని నా ప్రగాఢ విశ్వాసం. జగమెఱిగిన యీ కవి పుంగవులు ఇంతటితో ఆగకుండ, మరిన్ని తెలుగు రచనలు వెలువరించి, పాఠక లోకాన్ని ఆనందింపఁ జేస్తారని తలుద్దాం. ఆ షిరిడీశుడు శ్రీ చింతా రామ కృష్ణా రావు గారికి ఆయురారోగ్యాలు సదా యిస్తూ, ఆశీర్వదించాలని ఆశిస్తున్నాను.

ఇక సెలవు.

భవదీయ,

డా. ఎల్.ఎస్.యాజ్ఞవల్క్య శర్మ.

తే. 02 - 03 - 2009.

## శ్రీ షిరిడీశదేవ శతకము. కవితాభినందనం.

### కవివతంస శ్రీ బులుసు వేంకటేశ్వర్లు,

తెలుగు సాహిత్యంలో శతక రచన అగ్ర స్థానం పొంది యున్నది. కవులు తమ అనుభవాల్ని -ఆశల్ని - ఆర్తితో - ఆనందంతో చెప్పుకొనడానికి చక్కని వీలుంది శతక రచన లోనే! లౌకిక అలౌకిక భావాలు ప్రక్క ప్రక్కనే చెప్పుకోడానికి ఒక్క శతక ప్రక్రియలోనే అవకాశం కలుగుతుంది.

పూర్వం అంటే ఇప్పటికి ముప్పై నలభై ఏళ్ళ క్రితం పల్లెల్లో సాధారణ రైతులు కూడా సమయోచితంగా శతక పద్యాల్ని తమ సంభాషణల్లో ఉదహరిస్తూ మాటలాడేవారు. అలాగే అప్పటి గృహ లక్ష్ములు కూడా చక్కని తెలుగులో జాతీయాల సౌరభాలు గుబాళించే లాగ మాటలాడే వారు. ఇప్పటి తరం పిల్లలకి అనివార్యంగా సంకర తెలుగు మాటలాడే దౌర్భాగ్యం వచ్చింది. సాధారణంగా ఏ ఉద్యమమైనా ప్రజలనుంచి వస్తేనే అది కార్య రూపం ధరిస్తుంది. కొందరు విద్యావంతుల ఆశల్ని ముందుగా పసిగట్టి రాజకీయ నాయకులు వారిని సంతృప్తి పరచడం కోసం ఆయా విషయాల్ని ఉద్యమాలుగా ప్రచారం చేస్తారు. దానితో అది రాజకీయ అజెండాలో చేరి ఒక పార్టీ ప్రణాళికలో అంశంగా చేరిపోతుంది. అంతే ఇంక అది ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే అన్నట్లు తయారు అవుతుంది. పది మందిలో పాము చావదు అన్నట్లు కాలంలో బడి నలుగుతూ ఉంటుంది. ప్రస్తుతం తెలుగు భాష ఔజ్వల్యం అలాగే తయారయింది. అందుకనే మాతృ భాషలో విద్యా బోధన అనే విప్లవం ప్రజల్లోంచి రావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మాధ్యమం ప్రవేశ పెట్టినప్పుడు ప్రజల్లోంచి తగినంత స్పందన రాలేదు.ఈ నేపథ్యం అంతా ఎందుకంటే ప్రస్తుతం అధునిక కవులు కూడా శతకాలు వ్రాస్తున్నారు. శతక ప్రక్రియ వెనక బడలేదు. కొంచెం తన ప్రణాళికను మార్పు చేసుకొని, అనేకానేక అంశాలు స్పృశిస్తూ ముందుకు సాగుతోంది. భక్తి శతకమే అయినా అనివార్యంగా సమాజం లోని అనేక కోణాల్ని చూపుతోంది ఈనాటి శతకం. శ్రీ షిరిడీశ దేవరా! అన్న మకుటంతో 108పద్యాల్లో సాగిన ఈ శతకం మిత్రులు శ్రీ చింతా రామ కృష్ణా రావు గారు రచించారు.వీరు తెలుగు అధ్యాపకునిగా పని చేసారు. సాహిత్య మిత్రులు. ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యాలను ఆపోశన పట్టిన పండితులు. సమాజాన్ని నిశితంగా పరిశీలించే హృదయం కలవారు. దీనులయెడ సహానుభూతి కలిగిన ఉత్తమ సంస్కారవంతులు. అందుకే ఈ శతకం నిండా సమాజం లోని చీకటి కోణాల నుండి అనేకానేక అసమంజస విషయాలపై కవి తీర్పు లుంటాయి. వేదన లుంటాయి. ఆశావహ దృక్పథంతో కూడిన సందేశాలుంటాయి. ఏతావాతా శ్రీ చింతా రామ కృష్ణా రావు గారి ఈ శతకం భక్తితో పాటు లోకజ్ఞతను కూడ పంచి పెడుతుంది పాఠకులకు. పద్య నిర్మాణంలో కూడా ఈ కవి చాలా సిద్ధ

హస్తులు. పద్యం గోదావరిలా సాగి పోతుంది. భావ కూలంకషయై మనల్ని నివ్వెఱ పరుస్తుంది.
అభ్యుదయ భావాలు, దేశ భక్తి ప్రపూర్ణమైన భావనలూ ఈ శతకంలో దర్శనమిస్తాయి.
యువ తరాన్ని ఎంతగా శ్లాఘించారో ఈ కవి.

*ఉ:- భారత మాత రక్షణము భవ్య మహోజ్జ్వల భావిఁ గొల్పగా,*
*ధీరులు, సజ్జనావళి విధేయులు, మా యువ భారతీయులే*
*కారణ భూతు లయ్య. కలి కల్మష దూరులఁ జేయుమయ్య. నీ*
*వారికి శక్తి నీయుమయ భవ్యుడ! శ్రీ షిరిడీశ దేవరా! 47*

యువతకు దేశ భక్తి - రక్షణా శక్తి - యీయుమని సాయిని ప్రార్థించడం హర్షణీయం.
అలాగే స్త్రీలను వేధించే వారిని వీరు చాలా గర్హించారు.

"అద్వైతం సుఖ దుఃఖయోః" అంటూ దాంపత్య బంధాన్ని ఎంత గొప్పగా భవభూతి చెప్పాడో. అట్టి దాంపత్య బంధాల్ని తృణీకరించే "పురుష పుంగవుల్ని" వీరు చాలా సూటిగా, కరుకుగా విమర్శించారు. " కన్నులఁ బెట్టి కావుమయ! కాంతల" నంటూ సాయి దైవాన్ని ప్రార్థిస్తారు. చాలా పద్యాల్లో వీరి సంస్కార హృదయం దర్శనమిస్తోంది. చక్కని పోలికలు కూడా కనిపిస్తాయి.

" శరీరము గుమ్మడి పండులా గుట్టుగా కుళ్ళి నశిస్తుంది" అని అంతారు. ఎంత మంచి పోలిక! గుమ్మడి పండు కంటికి బాగానే కనిపిస్తున్నట్లుంటుంది. కాని లోపల కుళ్ళిన సంగతి మనకు తెలియదు దానిని తాకేదాకా!

*ఉ:- నీ దరి చేరు వాడనయ! నీ శతకంబుఁ బఠించు వాడ. స*
*మ్మోదము తోడఁ గాంచుమయ! మూలము నీవయి కావుమయ్య! యా*
*వేదనఁ బాపుమయ్య! సమ దృష్టి నొసంగి రహింపఁ జేయుమా!*
*మేదిని పైన నన్ గనుమ మేలుగ. శ్రీ షిరిడీశ దేవరా! 98*

పద్యం వీరి భక్తి, మోక్షము యెడల వీరికి గల కాంక్ష, సాయిపై గల ప్రేమనూ ప్రత్యక్షరం ప్రత్యక్షం చేస్తున్నది. ఇలా శతక మంతా ఉదహరించ వలసి వస్తుంది మంచి మంచి పద్యాల కోసం. పాఠకులుగా మీరు శతకంలోఎలాగూ ప్రవేశిస్తారు. కాబట్టి ఈ ముందు మాటను ముగిస్తున్నాను.

శ్రీ చింతా రామ కృష్ణా రావు గారు తమ చిక్కని, చక్కని భావాల్ని పద్య రూపంగా మలచి, శిరీష కుసుమ పేశలంగా సాయి శతకంగా రచించి, ఆ దేవ దేవునకు సమర్పించి, మనకు

చక్కని మాధుర్య కవిత్వ ప్రసాదం పెట్టారు. ఈ శతకాన్ని కన్నుల కద్దుకొని ఆస్వాదించ వచ్చును.
మిత్రులు శ్రీ చింతా రామ కృష్ణా రావు గారు ఇతోధికంగా సాహిత్య సేవ చేస్తూ - పరిణతి చెందిన తమ కవితాధోరణిని మంచి కావ్యాలు రచించాలని, మనసారా ఆకాంక్షిస్తూ -
అభినందిస్తున్నాను.

బులుసు వేంకటేశ్వర్లు,
కల్ప వృక్షం,
చిట్టివలస.

# శ్రీ షిరిడీశదేవ శతకము

## రచన:- చింతా రామ కృష్ణా రావు

ఉ:- శ్రీద! విరూప! భాగ్యదుఁడ! చెన్నుగ నా మనమందు నిల్చి, స
మ్మోదము నాపయిన్ నిలిపి, ముక్తిని గొల్పి, తమో గుణాదులన్
నాదరిఁ బాయఁ జేయుమయ. నాధుఁడ! నిన్ గని ప్రస్తుతించెదన్.
నీ దరిఁ జేర్చి కావుమయ! నిత్యుఁడ! శ్రీ షీరిడీశ దేవరా! 1

ఉ:- సుందర సత్ ప్రబంధముగ సూనృత! నీ మహిమాదికంబు సద్
బంధుర సత్ పదంబులను పన్నుగ గైకొని, వ్రాయఁ గోరి, మున్
ముందుగ నీపయిన్ శతకమన్ భువి వ్రాయగఁ బూనితయ్య! ఇ
బ్బందులు పారద్రోలి, నిలు ప్రాపుగ. శ్రీ షిరిడీశ దేవరా! 2

చ:- ప్రమద గణాభిసేవితము పావన శ్రీ షిరిడీ పురంబు. సద
ద్విమల యశో విరాజితము, విస్తృత సత్కృతికాకరంబు, మా
భ్రమలను రూపు మాపి, గురు పాదయుగంబునుఁ గొల్వ జూపి, నే
రములను సేయనీయకుమ!, నిత్యుఁడ! శ్రీ షిరిడీశ దేవరా! 3

ఉ:- శ్రీ సమ! సాయి నాధ! గుణ శేఖర! శ్రీ షిరిడీ నివాస! నీ
ధ్యాస యొకింత గల్గి, పర తత్వముఁ గాంచి, భజించు వారికిన్
మోసములంటనీయవుగ! ముక్తిని గొల్పి రహింపఁ జేతువే!
నీ సరి దైవమేడ? మహనీయుఁడ! శ్రీ షిరిడీశ దేవరా! 4

ఉ:- కన్నుల నిచ్చినావు నినుఁ గన్గొను భాగ్యమునీయనెంచి, మా
కన్నులవేమి జూచు? కళ కాంతులఁ గోల్పడు భౌతికమ్ములన్.
పన్నుగ నీదు రూపమును ప్రస్ఫుటమొప్పగఁ జూడగా వలెన్
కన్నులు గల్గు భాగ్యమది కాదొకొ? శ్రీ షిరిడీశ దేవరా ! 5

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=483**